

అప్రమత్తంగా ఉండాలి..
వర్షాకాలంలో విద్యుత్ అధికారులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. - 8లో▸



సర్టిఫికెట్ల పరిశీలన షురూ..
ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు గాను వరంగల్ పట్టణంలోని పలు హెల్ప్‌లైన్ సెంటర్లలో మంగళవారం సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ప్రారంభమైంది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$29^0/24^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై వర్షం కురుస్తుంది. మధ్యాహ్నం వేళ సాధారణంగా ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

శానిటేషన్ సవాల్!

- పరకాలలో అపరిశుభ్రంగా కాలనీలు
- నిధులు లేక.. 30 ఏళ్ల నాటి డ్రెయినేజీలే గతి
- 64 మంది కార్మికులు.. 150 కాలనీలకు పారిశుద్ధ్య పనులు
- 15 వాహనాలు.. ఉపయోగంలో ఉన్నవి పది మాత్రమే

సాక్షి ఫోకస్

పరకాల: పారిశుద్ధ్య కార్మికులు.. స్వచ్ఛ వాహనాల కొరతతో పరకాల మున్సిపాలిటీ పరిధిలో శానిటేషన్ పనులు ఓ సవాలుగా మారాయి. మరోవైపు నిధుల కొరతతో కొత్త డ్రెయినేజీల నిర్మాణం లేక.. రోడ్లపై మురుగునీరు పారుతోంది. 30 ఏళ్లక్రితం నిర్మించిన అస్తవ్యస్థ డ్రెయినేజీల్లోంచి మురుగునీరు పారట్లేదు. నీరు నిలుస్తున్న కారణంగా దోమలు విజృంభిస్తున్నాయి. ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పరకాల మున్సిపాలిటీ పరిధిలో 22 వార్డులు.. 150కిపైగా కాలనీలు.. 40 వేలకు పైగా జనాభా ఉంది. ఒకే ఒక్క శానిటేషన్ అధికారితో నలుగురు జవాన్లు కేవలం 64 మంది పారిశుద్ధ్య కార్మికులతో శానిటేషన్ పనులు చేపడుతుంటే పాలకులకు ప్రజల ఆరోగ్యంపై ఎంత శ్రద్ధ ఉందో స్పష్టమవుతోంది. 64 మందిలో సగం మంది కార్మికులు అంటే.. 32 మందికి పైగా.. పట్టణంలోని ప్రధాన రహదారులు.. కూడళ్లలో పారిశుద్ధ్య పనులు చేస్తుండగా.. మిగతా 32 మందిని షిఫ్టుల వారీగా (22 వార్డుల పరిధిలోని ఒక వార్డుకు.. ఇద్దరు కూడా లేని పరిస్థితి) కాలనీల్లో పనులు చేపడుతున్నారు.

చెత్తాచెదారం..

పరకాల మున్సిపాలిటీలో గల్లీలన్నీ డంప్ యార్డులను తలపిస్తున్నాయి. చెత్తను తీసుకెళ్లాల్సిన స్వచ్ఛ వాహనాలు వారానికోసారైనా రావట్లేదు. చెత్తాచెదారాన్ని కాలనీ ప్రజలు ప్రధాన కూడళ్లలో పారబోస్తున్నారు. ఆ చెత్తను కూడా ట్రాక్టర్లలో తరలించకుండా పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో చెత్తంతా మళ్లీ కాల్వల్లోనే కలిసిపోతోంది.

వృద్ధాప్యం పేరిట కార్మికుల తొలగింపు

నెల రోజుల క్రితం పరకాల మున్సిపల్ అధికారులు 15 మంది కార్మికులను వృద్ధాప్యంలో ఉన్నారని తొలగించారు.. అసలే పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య తక్కువగా ఉండగా వృద్ధాప్యం, వేతనాలు అందించలేని దుస్థితిలో ఉన్నామంటూ 79 మంది కార్మికుల్లో 15 మందిని తొలగించి వారి స్థానంలో వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి, లేదా కొత్తవారికి అవకాశం ఇవ్వాల్సి ఉండగా నియామకం చేసుకోకపోవడంతో సమస్య మరింత జటిలంగా మారింది.

వాహనాలు నిరుపయోగం

మున్సిపాలిటీకి 15 వాహనాలుండగా.. 10 వాహనాలు (7 స్వచ్ఛ వాహనాలు, 3 ట్రాక్టర్లు) ఉపయోగంలో ఉన్నాయి. ప్రధాన రహదారుల్ని శుభ్రం చేయడానికి రెండేళ్ల క్రితం రూ.87 లక్షలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన సొంత వాహనం ఏడాదికే నిరుపయోగంగా మారింది. ఆయా వాహనాల మరమ్మతులకు లక్షలు అవసరమవడంతో తమ వల్ల కాదంటూ అధికారులు చేతులెత్తేశారు.

నిధుల్లేక 30 ఏళ్ల కాల్వలే గత్యంతరం

నిధులు లేకపోవడంతో పరకాల మున్సిపల్ గత పాలకవర్గం డ్రెయినేజీల నిర్మాణానికి తీర్మాణాలు ప్రయోజనం లేకుండా పోయాయి. దీంతో 30 ఏళ్ల క్రితం చేసిన డ్రెయినేజీలే పట్టణ ప్రజలకు గత్యంతరంగా మారాయి.



సగర వీధిలో పేరుకుపోయిన చెత్తాచెదారం



జరిమానా బోర్డు ఉన్నప్పటికీ.. జెడ్పీహెచ్ఎస్ స్కూల్ ఎదుట చెత్తాచెదారం



కూరగాయల మార్కెట్ రోడ్డులో డ్రెయినేజీ లేక రోడ్డుపై నిలిచిన మురుగునీరు



ఈఫొటోలో ఉన్న మహిళ పేరు జయ. ఈమెది హరితనగర్. ఇప్పటికే భర్త అనారోగ్యంతో చనిపోయాడు. తమ ఇంటికి సమీపంలో స్థానికులు చెత్త వేస్తున్నారని ఆమె ఆందోళన చెందుతోంది. కోళ్లు, మేకల వ్యర్థాలతో పాటు ఒక్కో సమయంలో చనిపోయిన కుక్కలు, పందుల్ని సైతం తీసుకొచ్చి వేస్తుంటే దుర్వాసన భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తోంది.



ఈఫొటోలో ఉన్న వృద్ధురాలి పేరు వరలక్ష్మి, ఈమెది గౌడ వాడ. చెత్త తీసుకెళ్లే స్వచ్ఛ వాహనం వచ్చినట్లు తెలియగానే చెత్త తీసుకొని బయటకు వస్తుంది. కానీ.. అప్పటికే బండి వెళ్లిపోతుంది. ఏం చేయాలో తోచని ఆమె.. చివరికి చెత్తను రోడ్డుపైనే వేస్తోంది.

అవస్థలు పడుతున్నాం..



30 ఏళ్ల క్రితం అప్పటి సర్పంచ్ జంగేటి ఓదెలు వేయించిన మురుగుకాల్వ. అప్పటి నుంచి ఇప్పటి వరకు కొత్త కాల్వ లేదు. కాల్వలన్నీ మట్టితో పూడుకుపోతున్నాయి. కనీసం కాల్వ తీద్దామనే ఆలోచన కూడా మున్సిపల్ సిబ్బందికి రావట్లేదు. దోమలు దోమలు కుట్టి రోగాల పాలవుతున్నాం.
- డి.కుమారస్వామి, వడ్లవాడ

కాల్వలు తీసే నాథుడే లేడు..



ఇంటి ముందు కాల్వలో మురుగునీరు పేరుకుపోయి చాలా ఇబ్బందులు పడుతున్నాం. కాల్వలను వారానికోసారి కాదు.. కనీసం నెలకోసారి కూడా తీసేవారు లేరు.
- డి.మణెమ్మ, వడ్లవాడ

పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి



మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి ప్రధానంగా శానిటేషన్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాం. స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆదేశాలతో కొత్తగా మరిన్ని వాహనాల కొనుగోలుకు ప్రతిపాదనలు చేయనున్నాం. పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యంపై సీరియస్ చర్యలు ఉంటాయని కార్మికులను హెచ్చరించాం. చెత్తను రోడ్లపై వేసేవారికి జరిమానాలు విధిస్తాం.
- కె.సుష్మ, పరకాల మున్సిపల్ కమిషనర్

న్యూస్‌రీల్

విప్రచిత్తా, మహావజ్రేశ్వరీ క్రమాల్లో భద్రకాళి





హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళి దేవాలయంలో నిర్వహిస్తున్న శాకంబరీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆరో రోజు అమ్మవారిని విప్రచిత్తా, మహావజ్రేశ్వరిగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులకు ఉచిత ప్రసాదాల వితరణ చేశారు. అర్చకులు భద్రకాళి శేషు, ఈఓ శేషుభారతి, సిబ్బంది, ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అంతర్జాతీయ సదస్సులో సుజాత పరిశోధన పత్రం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కాలేజీ లైబ్రరీ అసిస్టెంట్ డాక్టర్ సుజాత శ్రీలంకలోని పెరదేనియా సెంట్రల్ యూనివర్సిటీలో గత నెల 26, 27వ తేదీల్లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్నారు. తోపుడు బండి (ట్రాలీకార్ట్) అండ్ ఇట్స్ సర్వీసెస్ ఇన్ తెలంగాణ, ఇండియా అనే అంశంపై పరిశోధనపత్రం సమర్పించారు. ఇది ఉత్తమ పత్రంగా ఎంపికైనట్లు ఆమె మంగళవారం ఇక్కడ తెలిపారు. క్యాంపస్‌లో వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం, ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ.. సుజాతను అభినందించారు.

అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు

హన్మకొండ: తమిళనాడులోని అరుణాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు వరంగల్ రీజినల్ మేనేజర్ దర్శనం విజయ భాను మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్-1 డిపో సూపర్ లగ్జరీ బస్ (సర్వీస్ నంబర్ 92222) ఈ నెల 8న మధ్యాహ్నం 3 గంటలకు హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నుంచి బయ యల్దేరుతుందని పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం 90634 07493, 77805 65971, 98663 73825, 99592 26047 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

గురుకులాల్లో అడ్మిషన్ల టార్గెట్ పూర్తి చేయాలి

డీఎండబ్ల్యూఓ గౌస్ హైదర్



న్యూశాయంపేట: హనుమకొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న మైనార్టీ గురుకులాల్లో అడ్మిషన్ల లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి కేపీ.గౌస్ హైదర్ ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యాప్తంగా ఉన్న నాలుగు గురుకులాల ప్రిన్సిపాళ్లతో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన మాట్లాడారు. పేద మైనార్టీలకు అందాల్సిన ఫలాలను వారు అందుకునేలా కృషి చేయాలని, ఇంటింటికీ తిరిగి గురుకులాల్లో అడ్మిషన్లు పొందితే కలిగే లాభాలను వివరించాలని సూచించారు. హనుమకొండ రాయపురలో బుధవారం నిర్వహించనున్న ఇంటింటి ప్రచారంలో తాను కూడా పాల్గొననున్నట్లు తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఎండబ్ల్యూఓకు ప్రిన్సిపాళ్లు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. సమీక్షలో సూపరింటెండెంట్ రాజు, డాక్టర్ సయ్యద్ ఖాజా మొహిసినాబాను, ఆర్ఎల్సీ శ్రీనివాస్, ప్రిన్సిపాళ్లు డాక్టర్ జె.సతీశ్, నీరజ, తదితరులు పాల్గొన్నారు.

తాటికాయలను సందర్శించిన ఆర్డీఓ



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న ఆర్డీఓ

ధర్మసాగర్: మండలంలోని తాటికాయల గ్రామంలో ఇటీవల ఓ వివాహితపై జరిగిన దాడి విషయంపై ఆర్డీఓ రాథోడ్ రమేశ్ మంగళవారం గ్రామంలో పర్యటించారు. గ్రామంలో జరిగిన అమానవీయ ఘటన పూర్వాపరాలు గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు స్థానిక తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ అనిల్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరొకరి పరిస్థితి విషమం



ఆళ్ల శ్రీహరి (ఫైల్)

ఎల్కతుర్తి: కారు అతివేగంతో వచ్చి ఢీకొట్టడంతో భీమదేవరపల్లి మండలం కొత్తపల్లికి చెందిన ఆళ్ల శ్రీహరి(28) మంగళవారం మృతిచెందాడు. ఈఘటనలో మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. కొత్తపల్లికి చెందిన ఆళ్ల శ్రీహరి(28), మంచినీళ్ల వెంకటేశ్ ఇద్దరు కలిసి ద్విచక్రవాహనం (పల్సర్ బైక్)పై సెంట్రింగ్ కర్రకోసం పీసర గ్రామానికి వెళ్లారు. ట్రాలీలో సెంట్రింగ్ కర్ర ఎక్కించి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి తిరిగి వస్తున్నారు. కొత్తకొండ సమీపంలోని సబ్‌స్టేషన్ సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన కారు అతివేగంగా శ్రీహరి బైక్‌ను ఢీకొట్టింది. శ్రీహరికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందగా.. వెంకటేశ్‌కు బలమైన గాయాలవడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మృతుడి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ ప్రేమ్‌చంద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయిబాబు తెలిపారు.

ఘనంగా కుమారషష్టి ఉత్సవం

గీసుకొండ: మండలంలోని ఊకల్‌హవేలి నాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కుమార షష్టి పూజలు ఘనంగా నిర్వహించారు. శివపార్వతుల కుమారుడు కుమారస్వామి సర్ప రూపంలో కొలువుదీరిన ఈ ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చి పూజలు చేశారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

- కలెక్టర్ స్నేహ శబరీష్



కేజీబీవీలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ స్నేహశబరీష్, చిత్రంలో డీఈఓ వాసంతి

ఆత్మకూరు: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలని కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మండలంలోని అక్కంపేటలో ప్రాథమిక పాఠశాల, జెడ్పీ హైస్కూల్, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేసి రికార్డుల నిర్వహణపై అసహనం వ్యక్తం చేశారు. పాఠశాలల్లో పిల్లలకు యూనిఫాం, పాఠ్యపుస్తకాల పంపిణీ జరిగిందా? అని అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లల కేస్‌స్టడీలు నమోదు చేస్తున్నారా? అని తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారా లేదా? అని తెలుసుకున్నారు. మండలంలోని తిరుమలగిరిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని, నర్సరీని పరిశీలించారు. కేజీబీవీలో వంటలను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పీహెచ్‌సీని పరిశీలించారు. కలెక్టర్ స్నేహశబరీష్ మాట్లాడుతూ.. అక్కంపేటలో రోడ్డు సౌకర్యం కల్పించడానికి ప్రతిపాదనలు చేయాలన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంట డీఈఓ వాసంతి, అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాసరావు, కేజీబీవీ జీసీడీఓ సునిత, తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ విజయ్‌కుమార్, ఈజీఎస్ ఏపీఓ రాజిరెడ్డి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ వాసవి, అక్కంపేట హెచ్ఎం ఉపేందర్‌రెడ్డి, ఐసీడీఎస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలిక కుటుంబానికి న్యాయం చేస్తాం

- పరకాల ఆర్డీఓ డాక్టర్ కె.నారాయణ
- న్యాయం చేయాలంటూ అధికారులకు ఫిర్యాదు చేసిన బాలిక తల్లిదండ్రులు



న్యాయం చేయాలంటూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న బాలిక తల్లిదండ్రులు

పరకాల: మల్లక్‌పేట సోషల్ వేల్ఫేర్ రెసిడెన్షియల్‌లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న బాలిక కుటుంబానికి న్యాయం చేస్తామని పరకాల ఆర్డీఓ కె.నారాయణ తెలిపారు. మృతదేహంతో బాలిక కుటుంబ సభ్యులు ఆందోళనకు సిద్ధం కావడంతో సమాచారం అందుకున్న సీఐ క్రాంతికుమార్ ఆర్డీఓ నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. బాలిక మృతిపై విచారణకు పరకాలకు చేరుకున్న సోషల్ వేల్ఫేర్ జోనల్ అధికారి స్వరూపరాణి, ఆర్డీఓ నారాయణ బాలిక తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో మాట్లాడి ఫిర్యాదు స్వీకరించారు. బాలిక మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు కుటుంబ సభ్యుల కోరిక మేరకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం కోసం కృషి చేస్తామని తెలిపారు.

‘స్థానికం’ కోసం.. ‘ముందస్తు’గా..

- పార్లమెంట్ నియోజకవర్గాలకు కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌లు
- టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు అవకాశం
- వరంగల్‌కు చిట్ల సత్యనారాయణ, మహబూబాబాద్‌కు పొట్ల నాగేశ్వర్‌రావు
- ఇతర జిల్లాల ఇన్‌చార్జులుగా ఓరుగల్లు నేతలు

సాక్షిప్రతినిధి, వరంగల్:

స్థానిక సంస్థల ఎన్నికలు కొద్ది రోజుల్లో జరిగే అవకాశం ఉండగా.. అధికార కాంగ్రెస్ పార్టీ ‘ముందస్తు’గా సిద్ధమవుతోంది. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అధిష్టానం సీనియర్లను రంగంలోకి దింపుతోంది. ఈక్రమంలోనే టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జ్‌లను నియమించింది. ఈ మేరకు టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ ఆ జాబితాను విడుదల చేశారు. ఇతర జిల్లాలకు చెందిన సీనియర్లను ఉమ్మడి వరంగల్‌కు నియమించిన టీపీసీసీ చీఫ్.. ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, సీనియర్లకు ఇతర జిల్లాల బాధ్యతలు అప్పగించారు. ఒక్కో పార్లమెంట్ స్థానానికి ఒక ఉపాధ్యక్షుడు, ముగ్గురు ప్రధాన కార్యదర్శులను నియమించారు. వరంగల్ (ఎస్సీ) పార్లమెంట్ నియోజకవర్గం వైస్ ప్రెసిడెంట్‌గా చిట్ల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శులుగా దుద్దిళ్ల శ్రీనివాస్, పల్లె శ్రీనివాస్ గౌడ్, మోత్కూరి ధర్మారావు, మహబూబాబాద్ (ఎస్టీ)కి వైస్‌ప్రెసిడెంట్‌గా మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శులుగా ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి, బేబీ స్వర్ణకుమారి, నాగ సీతారాములును నియమించారు. అదే విధంగా ఉమ్మడి వరంగల్‌నుంచి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని కరీంనగర్ పార్లమెంట్ వైస్ ప్రెసిడెంట్‌గా, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యను మల్కాజ్‌గిరి వైస్‌ప్రెసిడెంట్‌గా, హన్మాండ్ల ఝాన్సీరెడ్డికి సికింద్రాబాద్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు. నల్లగొండకు నమిండ్ల శ్రీనివాస్‌ను వైస్‌ప్రెసిడెంట్‌గా నియమించిన అధిష్టానం.. ఈవీ శ్రీనివాస్‌రావు, బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డిలు భువనగిరి, ప్రొఫెసర్ కత్తి వెంకటస్వామికి సికింద్రాబాద్ ఇన్‌చార్జ్ జనరల్ సెక్రటరీలుగా బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ లకావత్ ధన్వంతిని ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ ఆర్గనైజేషన్ ఇన్‌చార్జ్‌గా నియమించారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- కలెక్టర్ స్నేహ శబరీష్



కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్, వైద్యాధికారులు

హన్మకొండ అర్బన్: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడం ద్వారా వైద్యవృత్తికి న్యాయం చేకూరుతుందని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ వైద్యులకు సూచించారు. మంగళవారం డాక్టర్స్ డేను పురస్కరించుకొని కలెక్టరేట్‌లో కేక్ కట్ చేసి వైద్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రతీ పేదవాడికి వైద్యం అందాలని, ఆరోగ్య తెలంగాణ దిశగా కృషి చేయాలని సూచించారు. అనంతరం డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, కేఎంసీ ప్రిన్సిపాల్ రాంకుమార్‌రెడ్డి, అడిషనల్ డీఎంహెచ్ఓ మదన్ మోహన్‌రావు, ఇమ్యూనైజేషన్ అధికారి మహేందర్, జిల్లా క్షయ వ్యాధి నివారణాధికారి హిమబిందు, ప్రోగ్రాం అధికారులు మంజుల, డాక్టర్ అహ్మద్‌లను శాలువాలతో సత్కరించారు. వైద్యుల క్రీడల్లో గెలుపొందిన వారికి ప్రశంసపత్రాలు, కప్ బహూకరించారు. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆ.. జలపాతాల సందర్శన నిషేధం

అటవీ, పోలీస్ అధికారుల నిర్ణయం
- రక్షణ లేకపోవడం.. గత ప్రమాదాలే ప్రధాన కారణం
- దారులు మూసి.. కాపలా ఉన్న సిబ్బంది
- బొగత జలపాతానికి రావాలంటూ పిలుపు



దుసపాటి లొద్దికి వెళ్లకుండా ఉన్న సిబ్బంది, సూచనలు చేస్తున్న ఎఫ్‌డీఓ



గుండంజలపాతానికి వెళ్లకుండా ఫ్లెక్సీ ఏర్పాటు చేసి కాపలా ఉన్న సిబ్బంది

వాజేడు: గతంలో జరిగిన ప్రమాదాల నేపథ్యంలో దండకారణ్యంలోని పలు జలపాతాల సందర్శనకు అటవీశాఖ, పోలీసుల ఆధ్వర్యంలో బ్రేకులు వేశారు. ములుగు జిల్లాలో ప్రాచుర్యం పొందని జలపాతాల సందర్శనకు పర్యాటకులు రావొద్దని కోరుతూ నిషేధం విధించారు. దీంతో గుట్టల సమీపంలో ఉన్న జలపాతాలను సందర్శించడం ఇక కష్టం కానుంది.

నిషేధించిన జలపాతాలివే..

వాజేడు, వెంకటాపురం(కె) మండలాలను ఆనుకుని దండకారణ్యం, కర్రె గుట్టలు ఉన్నాయి. ఈ గుట్టలపైనుంచి జాలువారుతూ వాజేడు మండలంలో మరికొన్ని జలపాతాలు ఉన్నాయి. కొంగాల సమీపంలో దుసపాటిలొద్ది, కృష్ణాపురం సమీపంలో భామనసిరి, దూలాపురం సమీపంలోని మాసన్‌లొద్ది, అరుణాచలపురం సమీపంలో గుండం, వెంకటాపురం(కె)లో ముత్యంధార జలపాతాలు ఉన్నాయి. ఇవి ఇంకా ప్రాచుర్యం పొందలేదు. కానీ, బొగత జలపాతం సందర్శన వచ్చే పర్యాటకులు ముఖ్యంగా యువత ఎక్కువగా ఈ జలపాతాలను తిలకించడానికి ఉత్సుకత చూపిస్తున్నారు. నిషేధం ఉందని తెలిసినా వెళ్తున్నారు.

రక్షణ లేకపోవడంతోనే..

దుసపాటి లొద్ది, మాసన్ లొద్ది, గుండం, ముత్యంధార, భామన సిరి జలపాతాలు నట్టడవిలో ఉన్నాయి. ఇక్కడికి చేరుకోవాలంటే చాలాదూరం అడవిలో కాలినడకన వెళ్లాలి. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఉండవు. ఇవి ఇంకా పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చెందలేదు. దీంతో ఇక్కడికి అష్టకష్టాలు పడి వెళ్లిన పర్యాటకులు ప్రమాదాలకు గురైన సందర్భంలో సమాచారం బయటికి తెలిసే అవకాశం ఉండడంలేదు. దీంతో స్థానిక అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ఈ జలపాతాల వద్ద ఎలాంటి రక్షణ చర్యలు, సౌకర్యాలు లేవు. దీంతో అటవీశాఖ సిబ్బంది వీటిని నిషేధించడంతోపాటు ఇక్కడికి పర్యాటకులు వెళ్లొద్దని అటువైపు వెళ్లే దారులను బారికేడ్లు పెట్టి మూసివేశారు. ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. దొంగ దారిలో వెళ్లకుండా సిబ్బందిని కాపలాగా ఉంచారు.

నిషేధిత జలపాతాలకు వెళ్లొద్దు



దట్టమైన అటవీ ప్రాంతంలోని ప్రమాదకర జలపాతాల సందర్శనకు అనుమతులు లేవు. అనవసరంగా పర్యాటకులు వెళ్లి ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దు. ప్రమాదం జరిగితే రక్షించడానికి ఆ సమయంలో ఎవరూ అందుబాటులో ఉండరు. ఈ విషయాన్ని పర్యాటకులు గుర్తుంచుకుని మాకు సహకరించాలి.
– ద్వాలియా, ఎఫ్‌డీఓ, వెంకటాపురం(కె)



బొగతకు రావాలంటూ పిలుపు

బొగత జలపాతానికి ఎలాంటి ఇబ్బందులూ లేవని, పర్యాటకులు తరలి రావాలని అధికారులు కోరుతున్నారు. అన్ని సౌకర్యాలున్న ఈ జలపాతాన్ని పర్యాటకులు వీక్షించాలని ఆహ్వానిస్తున్నారు. ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ కూడా బొగత జలపాతాన్ని వీక్షించాలని పిలుపునిచ్చారు. ఇక్కడికి రోజురోజుకూ పర్యాటకుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ మండలంలో సరైన వర్షం లేకపోవడంతో పూర్తిస్థాయిలో జాలువారడం లేదు.

క్లుప్తంగా

హత్య కేసులో నేరస్తుడికి జీవిత ఖైదు..

వరంగల్ లీగల్ : భార్య, కొడుకుతో గొడవపడి ఇంట్లో ఎవరూ లేని సమయంలో భార్యను హత్య చేసిన ఘటనలో నేరం రుజువుకావడంతో కాజీపేట మండలం అమ్మవారిపేటకు చెందిన నేరస్తుడు మైదం కొమురయ్యకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ పట్టాభి రామారావు మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొమురయ్య తన భార్య సంతోష, కుమారుడు రాజేశ్‌తో తరుచూ గొడవ పడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో తనను సరిగ్గా చూసుకోవడం లేదని 2024, డిసెంబర్ 19న భార్య సంతోష, కుమారుడు రాజేశ్‌పై గ్రామ పెద్దలకు ఫిర్యాదు చేశారు. అయితే పెద్దలు కొమురయ్యను మందలించి సక్రమంగా ఉండమని చెప్పి పంపించారు. అక్కడి నుంచి ఇంటికొచ్చిన రాజేశ్.. తన భార్యాపిల్లలను తీసుకుని అత్తాగారిళ్లు అల్లిపురం గ్రామానికి వెళ్లి తాను కూలీకి వెళ్లాడు. సాయంత్రం ఇంటికొచ్చిన(అమ్మవారిపేట) రాజేశ్ భార్య ఇంట్లో జరుగుతున్న దృశ్యం చూసి భయాందోళనకు గురైంది. ఒంటరిగా ఉన్న సంతోష మెడకు కొమురయ్య తాడు కట్టి హత్య చేస్తుండగా చూసి కేకలు వేయగా కొమురయ్య పరారయ్యాడు. వెంటనే తన భర్త రాజేశ్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందజేసింది. రాజేశ్ వచ్చి చూడగా తన తల్లి సంతోష మృతి చెందింది. దీంతో ఈ ఘటనపై రాజేశ్ మడికొండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హత్యానేరం కింద కేసు నమోదు చేసిన పోలీసులు.. కొమురయ్యను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. సాక్ష్యాధారాలను విచారించి కోర్టు నేరం రుజువు కావడంతో కొమురయ్యకు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జడ్జి డాక్టర్ పట్టాభిరామారావు తీర్పు వెల్లడించారు. కేసును పోలీసు అధికారులు సీఐ కిషన్ పరిశోధించగా లైజన్‌ఆఫీసర్ కరుణాకర్, పరమేశ్వర్ పర్యవేక్షించారు. హెడ్‌కానిస్టేబుల్ కుమారస్వామి, కానిస్టేబుల్ వీరగోని రాజేశ్, హోంగార్డు సదానందం సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టారు. ప్రాసిక్యూషన్ పక్షాన పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాము కేసు వాదించారు. కాగా, క్రిమినల్ చట్టాల మార్పు చెందిన తర్వాత భారతీయ న్యాయ సన్నిహిత కింద జూలైలో శిక్ష పడిన తొలి కేసు కావడం విశేషం.

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య

బయ్యారం: భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని కొత్తపేటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాపనపల్లి నర్సింహ(45) పన్నెండు సంవత్సరాలుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో భార్యతో కలిసి నివసిస్తున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. నాలుగు నెలల క్రితం భార్యాభర్తల మధ్య వివాదం చోటు చేసుకోగా నర్సింహ తన స్వగ్రామం కొత్తపేటకు వచ్చి మేస్త్రీ పని చేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో భార్య కాపురానికి రావడం లేదని సోమవారం రాత్రి గడ్డిమందు తాగగా కుటుంబసభ్యులు గమనించి మహబూబాబాద్‌లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి సోదరుడు రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

అడ్డుకుంటున్నది ఎవరు?

టీజీ ఎన్పీడీసీఎల్‌లో నిలిచిన వాచ్‌మెన్, స్వీపర్ పోస్టుల బైఫర్‌కేషన్



టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం

- ఫలితంగా రక్షణ, పరిశుభ్రతకు నోచుకోని నూతన విద్యుత్ కార్యాలయాలు
- జిల్లాల పునర్విభజనతో సంస్థ పరిధిలో పెరిగిన సర్కిళ్లు
- డివిజన్, సబ్ డివిజన్లు, ఈఆర్‌ఓల పునర్విభజన పూర్తి
- ఇంకా పూర్తికాని క్షేత్రస్థాయి పోస్టుల విభజన

హన్మకొండ: సాధారణంగా ప్రతీ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయంలో కచ్చితంగా వాచ్‌మెన్, స్వీపర్‌ను నియమిస్తారు. ఎందుకంటే ఆ కార్యాలయానికి సంబంధించి ఆస్తుల కాపలాకు వాచ్‌మెన్, నిరంతరం పరిశుభ్రంగా ఉంచడానికి స్వీపర్ ఉంటారు. అయితే రాష్ట్రంలో రెండు విద్యుత్ పంపిణీ సంస్థల్లో ఒక్కటైన టీజీ ఎన్పీడీసీఎల్‌లో మాత్రం ఆ పోస్టులను ఇంకా విభజన చేయడం లేదు. ఫలితంగా ఈ సంస్థ పరిధిలో నూతనంగా ఏర్పాటైన కార్యాలయాలకు కాపలా, పరిశుభ్రత కరువైంది. దీంతో అధికారులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. వాచ్‌మెన్, స్వీపర్‌ల విభజన కాకుండా తెర వెనుక ఎవరో అడ్డుకుంటున్నారని విద్యుత్ ఉద్యోగులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మిగతా ఉద్యోగుల విభజన పూర్తి చేసి వీరిని బైఫర్‌కేషన్ చేయకపోవడంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెరిగిన సర్కిళ్లు..

తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల పునర్విభజనతో పూర్వ వరంగల్ జిల్లా (సర్కిల్)లో నూతన సర్కిళ్లు, డివిజన్లు, ఈఆర్‌ఓలు, సబ్ డివిజన్లు, సెక్షన్ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. పాలన సౌలభ్యం కోసం వీటిని ఏర్పాటు చేశారు. ఆయా కార్యాలయాలకు ఇంజనీర్లు, ప్రొవెన్షియల్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బందిని సర్దుబాటు చేసి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. స్వీపర్, వాచ్‌మెన్‌ల బైఫర్‌కేషన్‌ను పట్టించుకోలేదు. ఫలితంగా వారు పాత కార్యాలయాల్లోనే విధులు నిర్వహిస్తుండగా, నూతనంగా ఏర్పాటైన కార్యాలయాల్లో వాచ్‌మెన్‌లు, స్వీపర్లు లేక అధికారులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు.

డివిజన్ల వారీగా ఉద్యోగుల సర్దుబాటు..

నూతన కార్యాలయాల ఏర్పాటు తర్వాత ఉద్యోగుల విభజనకు 2018, జూన్‌లో సీజీఎం చైర్మన్‌గా ఎస్‌ఏఓగా కన్వీనర్, పూర్వ సర్కిల్ పరిధిలోని ఎస్‌ఈలు సభ్యులుగా కమిటీని నియమించి సర్కిల్ స్థాయిలో ఉద్యోగుల విభజన చేశారు. అదే విధంగా సీజీఎం చైర్మన్‌గా, డీఈ టెక్నికల్ కన్వీనర్, ఎస్‌ఈలు సభ్యులుగా నియమించిన కమిటీ.. డివిజన్ల వారీగా ఉద్యోగులను సర్దుబాటు చేసింది. కానీ స్వీపర్, వాచ్‌మెన్‌లను ముట్టు కోలేదు. పూర్వ ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాలో ఇంజనీర్లు, ప్రొవెన్షియల్ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, స్వీపర్, వాచ్‌మెన్, లైన్‌మెన్ డ్రైవర్లను సర్దుబాటు చేశారు. కానీ ఒక్క పూర్వ వరంగల్ సర్కిల్‌లో స్వీపర్, వాచ్‌మెన్ లైన్‌మెన్ డ్రైవర్ పోస్టులను పట్టించుకోకుండా వదిలేశారు. ఆ తర్వాత 2022 ఏప్రిల్‌లో సర్కిల్ స్థాయిలో స్వీపర్, వాచ్‌మెన్, లైన్‌మెన్ డ్రైవర్ల విభజన, సర్దుబాటుకు కమిటీ నియమించారు. అదే విధంగా డివిజన్ స్థాయిలో స్వీపర్, వాచ్‌మెన్, లైన్‌మెన్ డ్రైవర్ పోస్టుల విభజన, సర్దుబాటు కోసం మరో కమిటీని నియమించారు.

మూడేళ్లు గడిచినా ఎలాంటి నిర్ణయం లేదు..

ఈ కమిటీలను నియమించి మూడేళ్లు గడిచాయి. అయినా ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. చైర్మన్‌లుగా వ్యవహరించాల్సిన సీజీఎంలు మారినా, బదిలీల్లో ఎస్‌ఈలు, ఎస్‌ఏఓలు, డీఈ టెక్నికల్‌లు మారుతున్నారే కాని ఉద్యోగుల విభజన మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా అక్కడే ఉంది. ఈ విషయాన్ని యాజమాన్యం కూడా సీరియస్‌గా పట్టించుకున్నట్లు కనిపించడం లేదు.

వాచ్‌మెన్, స్వీపర్ పోస్టుల విభజనను విస్మరించిన యాజమాన్యం..

వాచ్‌మెన్, స్వీపర్ పోస్టుల విభజనను యాజమాన్యం విస్మరించినట్లు కనిపిస్తోంది. పూర్వ వరంగల్ జిల్లా (సర్కిల్) పరిధిలో టీజీ ఎన్పీడీసీఎల్ నాలుగు సర్కిళ్లు ఏర్పాటు చేసింది. హనుమకొండ సర్కిల్ ఆఫీస్ పూర్వ కార్యాలయంగా, నోడల్ కార్యాలయంగా పని చేస్తుండగా, వరంగల్, జనగామ, మహబూబాబాద్ తోపాటు జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలను కలిపి భూపాలపల్లి సర్కిళ్లను ఏర్పాటు చేశారు. వీటితో పాటు డివిజన్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయాలకు సబ్ ఇంజనీర్ స్థాయి నుంచి డివిజనల్ ఇంజనీర్ వరకు, జూనియర్ లైన్‌మెన్ నుంచి ఫోర్‌మెన్ వరకు, జూనియర్ అసిస్టెంట్ నుంచి సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ వరకు అధికారులు, ఉద్యోగుల బైఫర్‌కేషన్ చేసి పోస్టులు మంజూరు చేసి భర్తీ చేసిన యాజమాన్యం.. వాచ్‌మెన్, స్వీపర్ పోస్టులను విస్మరించిందని అధికారులు, ఉద్యోగులు విమర్శిస్తున్నారు.

టీజీఎప్‌సెట్ సర్టిఫికెట్ల పరిశీలన షురూ..

- నాలుగు హెల్ప్‌లైన్ సెంటర్లలో వెరిఫికేషన్ ప్రక్రియ



వరంగల్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థినికి ధ్రువపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ ప్రభాకర్

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం టీజీఎప్‌సెట్-2025 ఎంపీసీ స్ట్రీమ్‌లో ఇంజనీరింగ్ అండ్ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకుగాను కాకతీయ యూనివర్సిటీ, హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కాలేజీ, కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలల్లోని హెల్ప్‌లైన్ సెంటర్లలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. ప్రథమ దశలో ఇప్పటికే స్లాట్‌బుకింగ్ చేసుకున్న విద్యార్థులు ఆయా హెల్ప్‌లైన్ సెంటర్లలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. స్లాట్ బుకింగ్ ప్రక్రియ జూన్ 28 నుంచి జూలై 7వ తేదీ వరకు ఉంది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జూలై 8వ తేదీ వరకు కొనసాగనుంది. క్యాంపస్‌లోని అడ్మిషన్ల డైరెక్టరేట్‌లో హెల్ప్‌లైన్ సెంటర్లో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసుకున్న విద్యార్థులకు డైరెక్టర్ ప్రొఫెసర్ సీజీ శ్రీలత, సహాయ కోఆర్డినేటర్ సురేశ్‌బాబు ధ్రువపత్రాలు అందజేశారు. తొలిరోజు 300 మంది విద్యార్థులకు వెరిఫికేషన్ చేశారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ హెల్ప్‌లైన్‌సెంటర్‌లో ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు.అలాగే, కేడీసీలోనూ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగింది. వరంగల్‌లోని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఆ కళాశాల ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్ సర్టిఫికెట్ల వెఫికేషన్ చేసుకున్న విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. తొలిరోజు 400 మంది విద్యార్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరయ్యారని ప్రభాకర్ తెలిపారు.

హనుమకొండ కాకాజీ కాలనీలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



జిల్లా వ్యాప్తంగా వర్షం

హన్మకొండ: నైరుతి రుతు పవనాలు చురుగ్గా కదులుతున్న క్రమంలో హనుమకొండ జిల్లా వ్యాప్తంగా మంగళవారం వర్షం కురిసింది. గత రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉండి తేలిక పాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. కొద్ది రోజులుగా వర్షాలు లేక తల్లడిల్లిన రైతాంగానికి ఈ వర్షం ఊరటనిచ్చింది. మెట్ట పంటలకు ఈ వాన జీవం పోసింది. ముందుగా విత్తనాలు వేసిన పంటలో కలుపు తీయడానికి అనుకూల వాతావరణం. సోమవారం ఉదయం 8.30 నుంచి మంగళవారం ఉదయం 8.30 గంటల వరకు కురిసిన వర్షపాతం వివరాలను ప్రణాళిక శాఖ విడుదల చేసింది. జిల్లాలో సగటున 14.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. భీమదేవరపల్లిలో 9.1 మిల్లీమీటర్లు, వేలేరులో 11.4, ఎల్కతుర్తిలో 12.7, కమలాపూర్‌లో 18.7, హసన్‌పర్తిలో 13.5, ధర్మసాగర్‌లో 10.9, కాజీపేటలో 15.4, హనుమకొండలో 13, ఐనవోలులో 18.5, పరకాలలో 8.3, దామెరలో 12.2, ఆత్మకూరులో 20.2, శాయంపేటలో 28.9, నడికూడలో 14.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: వర్షాకాలంలో విద్యుత్ అధికారులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్లు, నోడల్ జీఎంల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ అంతరాయాలు ఏర్పడిన వెంటనే పునరుద్ధరించేలా మెన్, మెటీరియల్ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ప్రతీ సబ్ స్టేషన్‌కు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా ఉండాలన్నారు. వచ్చే మూడు నెలల్లో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న లూజు లైన్లు, వంగిన పోల్స్, తుప్పు పట్టిన స్తంభాలు, తక్కువ ఎత్తులో ఉన్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెల ఎత్తు పెంచడం, లైన్ క్రాసింగ్, డబుల్ ఫీడింగ్ వచ్చే వాటిని గుర్తించి సరి చేయాలని ఆదేశించారు. 16 సర్కిళ్ల పరిధిలో కొత్తగా వ్యవసాయ కనెక్షన్లు పెరుగుతున్నాయని, అందుకు తగట్లు రిలీజ్ వేగవంతం చేయడానికి చర్యలు తీసుకోవాలని సీఈలను ఆదేశించారు. విద్యుత్ బిల్లుల వసూళ్లు వందశాతం జరిగేలా నోడల్ జనరల్ మేనేజర్లు దృష్టి సారించాలన్నారు. సమావేశంలో డైరెక్టర్లు వి. మోహన్ రావు, టి.మధుసూదన్, సి.ప్రభాకర్, వి. తిరుపతిరెడ్డి, చీఫ్ ఇంజనీర్లు టి.సదర్‌లాల్, బి.అశోక్ కుమార్, కె.తిరుమల్ రావు, రాజు చౌహాన్, అశోక్, రవీంద్రనాథ్, ఆర్.చరణ్ దాస్, మాధవరావు, జాయింట్ సెక్రటరీ కె.రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

7న గ్రేటర్ వరంగల్ కౌన్సిల్ సమావేశం

వరంగల్ అర్బన్ : గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్(జీడబ్ల్యూఎంసీ) కౌన్సిల్ సమావేశాన్ని ఈనెల 7న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు సెక్రటరీ అలివేలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన జరిగే సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. ఎక్స్ అఫిషియో సభ్యులు, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, కార్పొరేటర్లు, వింగ్ అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు.

మెడకు బెల్ట్ బిగించి.. కాళ్లను చున్నీతో కట్టేసి..

- ఫైనాన్స్ వ్యాపారిని హత్య చేసిన నిందితులు
- ఇద్దరి అరెస్ట్.. 16.5 తులాల బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన పోలీసులు



నిందితుల అరెస్ట్ చూపుతున్న ఏసీపీ ప్రశాంత్ రెడ్డి

కాజీపేట : మెడకు బెల్ట్ బిగించి.. కాళ్లను చున్నీతో కట్టేసి.. కూరగాయలు కోసే కత్తితో ఫైనాన్స్ వ్యాపారిని దారుణంగా హత్య చేసిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 16.5 తులాల బంగారం స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కాజీపేట పీఎస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డి.. సీఐ సుధాకర్ రెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు. వరంగల్ శివనగర్‌కు చెందిన త్రిపురాధి నవీన్‌కుమార్ (55) చిరువ్యాపారులకు ఫైనాన్స్ ఇస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో కాజీపేట రైల్వే క్వార్టర్స్‌లో సహజీవనం చేస్తున్న ఇద్దరు రైల్వే ఉద్యోగులు గుండా రజని(ఇందులో ప్రస్తుతం రజనీ ఉద్యోగం కోల్పోయింది.) , గడ్డం ప్రవీణ్‌కుమార్.. నవీన్‌కుమార్ వద్ద రూ.30 వేల అప్పు తీసుకున్నారు. అసలు, వడ్డీ కలిపి రూ.50 వేలకు పెరిగింది. ఈ డబ్బు చెల్లించాలంటూ నవీన్‌కుమార్ కొంత కాలంగా ప్రవీణ్‌కుమార్‌ను వేధిస్తున్నాడు. అప్పటికే పలు నేరాలతో సంబంధం ఉండి జైలుకెళ్లొచ్చి ఉద్యోగం కోల్పోయిన రజని, ప్రవీణ్‌కుమార్.. నవీన్‌కుమార్‌పై ఉన్న బంగారు ఆభరణాలు దోచుకోవాలనుకున్నారు. ఏ విధంగానైనా ఫైనాన్స్ వ్యాపారిని హత్య చేసి ఆభరణాలు కాజేసి కుటుంబ అప్పులు, అవసరాలు తీర్చుకోవాలని భావించి నవీన్ కుమార్‌కు శుక్రవారం ఫోన్ చేసి రైల్వే క్వార్టర్స్‌కు పిలిపించారు. అయితే అప్పు చెల్లిస్తారనే నమ్మకంతో వచ్చిన వ్యాపారి నవీన్‌కుమార్ మెడకు ప్రవీణ్ బెల్ట్ బిగించి ఊపిరి ఆడకుండా చేయగా, రజని కాళ్లను చున్నీతో కట్టివేసింది. అనంతరం కూరగాయలు కోసే కత్తితో పొడవడంతో పాటు బండరాయితో తలపై మోది నవీన్‌కుమార్‌ను హత్య చేశారు. తర్వాత నిందితులు మృతదేహాన్ని మాయం చేయాలని భావించగా ఎవరూ సహకరించకపోవడంతో చేసేదేమి లేక పరారయ్యారు.

హత్య అనంతరం పరారైన రజని..

ఫైనాన్స్ వ్యాపారి నవీన్‌కుమార్‌ను హత్య చేసిన అనంతరం రజనీ యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం మర్రిగూడెం గ్రామానికి చేరుకుంది. ప్రవీణ్ పట్టణంలోనే ఉండి పోలీసుల కదలికలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో ఈ హత్యపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు మర్రిగూడెంలో ఉన్న రజనిని అరెస్ట్ చేసి 16.5 తులాల బంగారు ఆభరణాలు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. కడిపికొండ క్రాస్‌లో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు ప్రవీణ్‌కుమార్ పట్టుబడ్డాడు.

ఇద్దరిది నేర చరిత్రే..

కాజీపేట రైల్వే ఎలక్ట్రికల్ షెడ్‌లో పని చేస్తున్న రజని, ప్రవీణ్‌కుమార్ 2013 నుంచి సహజీవనం కొనసాగిస్తున్నారు. కాగా, ప్రవీణ్‌కుమార్ తన భార్య రేణుకను అదనపు కట్నం కోసం వేధించడంతో ఆమె 2018లో ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనలో రజని, ప్రవీణ్‌కుమార్ జైలుకెళ్లొచ్చారు. జైలులో సహ నిందితులతో పరిచయం ఏర్పడింది. వారి సూచనల మేరకు ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసి డబ్బులు వసూలు చేయగా బసంత్‌నగర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. దీంతో ఉద్యోగాలు పోవడంతో ఇద్దరు సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగనోట్ల వ్యాపారం చేస్తూ పోలీసులకు పట్టుబడగా సుబేదారి, మట్టెవాడ, పాలకుర్తి పోలీసుస్టేషన్లలో కేసులు నమోదయ్యాయి.

రౌడీషీట్, పీడీ యాక్ట్ నమోదు ..

నిందితులు రజని, ప్రవీణ్‌కుమార్‌పై వెంటనే రౌడీషీట్ తెరవడంతోపాటు పీడీ యాక్ట్ నమోదు చేయనున్నట్లు ఏసీపీ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. కాగా, కేసు ఛేదనలో ప్రతిభకనబర్చిన సీఐ వై.సుధాకర్ రెడ్డి, ఎస్సైలు నవీన్‌కుమార్, సర్వేశ్వర్, సిబ్బంది శ్రీధర్, బి.భాస్కర్, విష్ణు, కె.శ్రీనివాస్‌ను ఏసీపీ అభినందించారు.

సురేఖ శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

- ఎన్నికల సంఘానికి మాజీ ఎమ్మెల్యే నరేందర్ ఫిర్యాదు



హైదరాబాద్‌లో ఉప ప్రధాన ఎన్నికల అధికారి హరిసింగ్‌కు వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

వరంగల్ చౌరస్తా: గత శాసన సభ ఎన్నికల్లో వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా పోటీ చేసిన కొండా సురేఖ రూ.70 కోట్లు ఖర్చు చేసినట్లు స్వయంగా తన భర్త, మాజీ ఎమ్మెల్సీ మురళీధర్ రావు బహిరంగంగా ప్రకటించడంపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో ఉప ప్రధాన ఎన్నికల అధికారి బి.హరిసింగ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తులను పరిశీలించాలని కోరారు. తాజాగా వరంగల్ తూర్పు నియోజక వర్గంలో జరిగిన కార్యక్రమంలో కొండా మురళీధర్ రావు వ్యాఖ్యల వీడియోలు ఉన్నాయని, వాటిని పరిశీలించి సురేఖ శాసన సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరారు.

డీఎంహెచ్‌ఓ, ప్రోగ్రాం అధికారులకు సన్మానం



వరంగల్ డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, వైద్యాధికారులను సన్మానించిన సిబ్బంది

గీసుకొండ: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ నగరంలోని వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో సిబ్బంది, అధికారులు మంగళవారం డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, ప్రోగ్రాం అధికారులను సన్మానించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని, వర్షాకాలంలో సంక్రమించే వ్యాధుల నివారణపై దృష్టి సారించాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు ప్రకాశ్, కొమురయ్య, ప్రోగ్రాం అధికారులు ఆచార్య, అర్చన, విజయ్‌కుమార్, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, ఎస్‌ఓ విజయలక్ష్మి, డీపీఓ అర్చన ,సిబ్బంది పాల్గొన్నారు.

కేయూ స్నాతకోత్సవానికి ఏర్పాట్లు

కేయూ క్యాంపస్ : ఈనెల 7న కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి సంబంధించిన పనుల పురోగతిని వీసీ కె. ప్రతాప్‌రెడ్డి.. రిజిస్ట్రార్ వి.రామచంద్రంతో కలిసి మంగళవారం పరిశీలించారు. క్యాంపస్‌లో పరిసరాలను పరిశుభ్రం చేసేందుకు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లతో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. మొదటి గేట్ నుంచి లైబ్రరీ వరకు శుభ్రం చేశారు. కార్యక్రమంలో కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ, కేయూ అభివృద్ధి అధికారి వాసుదేవరెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్లు కుమారస్వామి, శైలజ, ఎం. సౌజన్య, రజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్న మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థల్లోని గ్రూప్-బీ, గ్రూప్-సీ పోస్టుల భర్తీకి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాల భర్తీకి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ గత నెల 9న కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ ఎగ్జామినేషన్-2025 నోటిఫికేషన్ వెలువరించిందని పేర్కొన్నారు. ఈ పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించడానికి ఈనెల 4వ తేదీవరకు గడువుందని తెలిపారు. పరీక్ష ఈనెల 13 నుంచి 30 వరకు జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని డిగ్రీ, పీజీ చదివిన నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కొత్త రేషన్‌కార్డుల జారీని వేగవంతం చేయాలి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

- అధికారుల సమీక్షలో వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద

న్యూశాయింపేట: కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తుల పరిశీలన, రేషన్‌కార్డుల్లో అదనంగా పేర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో డిఫాల్టర్ రైస్‌మిల్లర్స్, రేషన్ కార్డుల పంపిణీ, భూభారతి దరఖాస్తుల పరిష్కారం, వనమహోత్సవం ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మండలంలో ఉన్న డిఫాల్టర్ రైస్‌మిల్లర్ల జాబితా సిద్ధం చేయాలని, రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రేషన్‌కార్డు లబ్ధిదారుల్లో డెత్ కేసులు ఉంటే గ్రామ పంచాయతీల నుంచి నివేదికలు సేకరించాలని పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన భూభారతి దరఖాస్తుల ఆన్‌లైన్‌ను వేగవంతం చేయాలని ఆదేశించారు. మహిళా పెట్రోల్ బంకుల స్థాపనకు ప్రభుత్వ స్థలాలను గుర్తించి నివేదికలు సమర్పించాలని తహసీల్దార్లకు సూచించారు. పీఎం కుసుమ ప్రాజెక్టు కింద సోలార్‌ప్లాంట్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. వనమహోత్సవంలో భాగంగా విరివిగా మొక్కలు నాటేందుకు ఒక్కో మండలంలో ఐదెకరాల చొప్పున ప్రభుత్వ స్థలాన్ని సేకరించి గ్రీనరీ ఏర్పాటు చేయాలని అన్నారు. వరంగల్, నర్సంపేట ఆర్డీఓలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, డీసీఎస్‌ఓ కిష్టయ్య, డీఎం సంధ్యారాణి, సంబంధిత మండలాల తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. కలెక్టరేట్‌లో డీఈఓ జ్ఞానేశ్వర్‌తో కలిసి ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. జెడ్పీ సీఈఓ రాంరెడ్డి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

జిల్లాలో నేషనల్ స్టూడెంట్స్ పర్యావరణ పోటీ-2025 పోస్టర్‌ను కలెక్టర్ సత్యశారద కార్యాలయంలో ఆవిష్కరించారు. డీఈఓ జ్ఞానేశ్వర్, జిల్లా సైన్స్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో అభివృద్ధి పనులు వేగవంతంగా చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం అధికారులతో జరిగిన సమీక్షలో ఆమె మాట్లాడారు.